జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 2 | జూన్ | 2026 ◆ పేజీలు : 10



## మారెళ్ళపాడు పంప్ హౌస్ ను సందర్శించిన మంత్రి తుమ్మల

- రహదారులు, మౌలిక సదుపాయాలను
- అర్హులైన గ్రామస్తులకు
- ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి
- పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల కి వినతి పత్రం అందజేత



2 లో...




3 లో..

# పి.యం. బ్రదర్స్ ఆసుపత్రిపై కొత్త వివాదం

- ప్రాణాలు కాపాడేందుకు కాలు తొలగించారా...? లేక నిర్లక్ష్యంతో ఆ పరిస్థితి తెచ్చారా..?
- గొప్పలకు పోయి బోర్లా పడ్డ పి.యం. బ్రదర్స్ ఆసుపత్రి తీరు..?
- కాలు తొలగించినది మీ ఆసుపత్రేనా..? హైదరాబాద్ వైద్యులా..?
- 18 రోజుల తర్వాత రోగిని తరలించి చేతులు దులుపుకున్న వైనంపై ప్రశ్నలు
- అత్యవసర చికిత్స పక్కన పెట్టి మూడు శస్త్రచికిత్సలు ఎందుకు..?
- లక్షల రూపాయలు ఖర్చు చేయించి చివరకు వికలాంగుడిగా మార్చారన్న బాధితుల ఆరోపణలు
- ఇరుకు భవనంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు అనుమతులు ఎలా..?
- డి.ఎం.&హెచ్.ఓ. సమగ్ర విచారణ చేపట్టాలని బాధితుల డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ లోని పి.యం. బ్రదర్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చుట్టూ వివాదాలు మరింత ముదురుతున్నాయి. ఇటీవల ఇల్లందు ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు భానోత్ నరేష్ చికిత్స విషయంలో బాధిత కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా తాజాగా ఆసుపత్రి యాజమాన్యం విడుదల చేసిన వివరణ మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది.

● కొత్తగూడెం, ప్రజాజ్యోతి

## పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్ జూన్ 01,(ప్రజాజ్యోతి)** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్ , వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు . ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టనున్న కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుండి 12 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేలా ఉండాలని, ప్రతి గ్రామం,

మిగతా 2 లో...

## అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలందాలి

- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



**భద్రాచలం టౌన్ , జూన్ 1 , ప్రజాజ్యోతి** సుదూర ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి గిరిజన దర్బార్ లో దరఖాస్తులు చేసుకొన్న గిరిజనులకు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా యూనిట్ అధికారులు కృషిచేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం నాడు ఐటిడిఏ సమావేశ మందిరంలో వివిధ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి

మిగతా 2 లో...

## మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రగతి

- మెప్మ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ
- మహిళలు కుటుంబ వ్యవస్థకు వెన్నెముక
- మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది
- పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, జూన్ 01 (ప్రజాజ్యోతి)** : మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు మెప్మ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన మహిళలకు చీరలను పంపిణీ చేసి, మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రగతి అని వారి సంక్షేమం పట్ల

మిగతా 2 లో...

## అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలందాలి

(మొదటి పేజీ తరువాయి...)

కృషి చేయాలని ఆయన అన్నారు. దర్బార్‌లో గిరిజనులు సమర్పించిన అర్జీలలో పోడు భూముల పట్టాలలో పేర్లు మార్పు కొరకు, రైతుబంధు రుణాల కొరకు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు, బోరు, మోటారు కొరకు , మారుమూల గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు దరఖాస్తులందాయి. అలాగే నూతనంగా మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసుకొనుట కొరకు, దీర్ఘకాలిక జబ్బులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి శిక్షణలు ఇప్పించుట కొరకు గిరిజనులు అర్జీలు సమర్పించారని తెలిపారు. గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలు అన్ని ఆన్లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ఆనంద కుమార్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఎఫ్ డి సి ఉదయ్ కుమార్, కొండరెడ్ల అధికారి గన్యా, ఏపీఓ పవర్ వేణు, ఏడిఎంహెచ్ఓ సైదులు, ఎల్ టి ఆర్ డి టి మనిధర్, డిఎం జిసిసి సమ్మయ్య, మిషన్ భగీరథ ఏ ఈ ఈ నారాయణరావు, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, జేడీఎం హరికృష్ణ, ఏవో సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, హౌసింగ్ ఏఈ హేమంత్ ఇతర శాఖల సిబ్బంది మబ్బు ప్రసాద్, నరేందర్, వెంకటేశ్వర్లు, సుప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి



(మొదటి పేజీ తరువాయి...)

విద్యాసంస్థలు , ప్రతి ప్రభుత్వ కార్యాలయం ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చి దిద్దినప్పుడే కార్యక్రమం విజయవంతమవుతుందని అన్నారు. అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు తమ తమ పరిధిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగం గా జిల్లాకు 55 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, ఆ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 శాతానికి పైగా అటవీ విస్తీర్ణం ఉందని, అన్ని శాఖల సమన్వయంతో గత రెండు సంవత్సరాలుగా ఒక్క ఎకరం పోడు భూమి కూడా నరికివేయకుండా సంరక్షించగలిగామని తెలిపారు. జిల్లాలో పామాయిల్, జామాయిల్, వెదురు తదితర పంటల సాగు విస్తరించడంతో జిల్లా పచ్చదనంతో కళకళలాడుతోందని, రాష్ట్రంలో పచ్చదన పరిరక్షణలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు . ఈ సందర్భంగా ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది విధుల నిర్వహణలో భద్రతకు ఉపయోగపడే సేఫ్టీ కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సౌకర్యం కల్పించాలని వినతి



**ఇల్లందు, జూన్ 1, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు మస్జిదు లైన్, రామాలయం వెనుక లైన్ కు మంచినీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మంచినీటిని సరఫరా చేయాలని 24 ఏరియా సివిల్ సూపర్వైజర్ మహేష్ కు సోమవారం 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ వినతి పత్రం అందజేశారు. 22వ వార్డు మస్జిదు లైన్, రామాలయం వెనుక లైన్ కు మంచినీరు రాక సుమారుగా ఐదు రోజులు కావస్తుందని తెలిపారు. వేసవికాలం కావడంతో మంచినీరు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. సింగరేణి అధికారులు స్పందించి మంచినీటిని సరఫరా చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరారు.

## మారెళ్ళ పాడు పంప్ హౌస్ ను సందర్శించిన మంత్రి తుమ్మల

- రహదారులు, మౌలిక సదుపాయాలను
- అర్హులైన గ్రామస్తులకు
- ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి
- పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల కి వినతి పత్రం అందజేత



**అశ్వాపురం,జూన్, 1, ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం పరిధిలోని, సీతా రామ ప్రాజెక్టు పంపు హౌస్ , కెనాల్ భూ సేకరణ కు సహకరించిన బీ జీ కొత్తూరు గ్రామానికి రహదారి మౌలిక సదుపాయాలు అర్హులైన గ్రామస్తులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సర్పంచ్ మర్రి సంధ్య, మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ కెనాల్ నిర్మాణానికి మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి , స్థానిక రైతు కొల్లు ఉప్పల్ రెడ్డి స్థానిక రైతాంగం త్యాగాలు మరువలేనీ వని బీజి కొత్తూరు గ్రామానికి అన్ని విధాల సహకరిస్తామని రహదారి నిర్మాణం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచు మర్రి మల్లారెడ్డి మాజీ ఎంపీపీ కొల్లుమల్లారెడ్డి సహకారంతో తుమ్మల చెరువు షట్టర్లు కాలువలు పూర్తిస్థాయిలో మరమతులు చేయాలని నీటిపారుల శాఖ అధికారులను తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

## మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి...)



రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళలు కుటుంబ వ్యవస్థకు వెన్నెముకని, మహిళ సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత, విద్య, ఆరోగ్యం మరియు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం మహిళల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారికి వివిధ రంగాల్లో శిక్షణ, రుణ సదుపాయాలు మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం మరియు రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు పంపిణీ చేసిన ఈ చీరలు మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవం, ప్రేమ మరియు బాధ్యతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ప్రతి పండుగ, ప్రతి శుభకార్యంలో మహిళలు ఆనందంగా పాల్గొనాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారి జీవితాల్లో సంతోషాన్ని నింపే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. అలాగే మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని, మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అవకాశాలను మహిళలు పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని పనిచేస్తోందని, మహిళలకు అవసరమైన ప్రతి రంగంలో అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో మహిళా సాధికారతకు చేపడుతున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మ సిబ్బంది, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామవరం డిస్పెన్సరీని యథావిధిగా కొనసాగించాలి

- సింగరేణి సీఎంఓకు వినతిపత్రం అందజేసిన ఎఐటీయూసీ నాయకులు



**కొత్తగూడెం, జూన్ 1( ప్రజాజ్యోతి )** కార్మిక ప్రాంతమైన రామవరంలో ఉన్న సింగరేణి డిస్పెన్సరీని యథావిధిగా కొనసాగిస్తూ పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని గుర్తింపు సంఘం ఎఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం సింగరేణి ప్రధాన వైద్యశాల ముఖ్య వైద్యాధికారి (సీఎంఓ) కిరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ రామవరం ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది సింగరేణి కార్మికులు, పదవీ విరమణ పొందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులకు ఈ డిస్పెన్సరీ ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా డిస్పెన్సరీని మూసివేయడం సరైన నిర్ణయం కాదన్నారు. డిస్పెన్సరీలో పనిచేస్తున్న ఉద్యోగి పదవీ విరమణ పొందిన నేపథ్యంలో కొత్త సిబ్బందిని నియమించకుండా ఆస్పత్రికి సీల్ వేయడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిన్నపాటి వైద్య సేవల కోసం సైతం సుదూర ప్రాంతంలోని ప్రధాన వైద్యశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కార్మిక కుటుంబాలపై అదనపు ఆర్థిక, శారీరక భారం పడుతోందన్నారు. రామవరం డిస్పెన్సరీలో తక్షణమే వైద్యులు, సిబ్బందిని నియమించి మందుల సరఫరా పునరుద్ధరించి ఆస్పత్రిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన సీఎంఓ కిరణ్‌రాజ్ డిస్పెన్సరీ భవనాన్ని పునర్నిర్మించి త్వరితగతిన సమస్యను పరిష్కరించి డాక్టర్‌తో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి సేవలు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. డిస్పెన్సరీ భవనం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఆధీనంలో ఉన్నందున భవన పునర్నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎఐటీయూసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి, సహాయ కార్యదర్శులు గట్టయ్య, రాము, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, పిట్ కార్యదర్శులు అనంత లక్ష్మి , మధుకృష్ణ, కమల్, ఆఫీస్ బేరర్లు నాగయ్య, కర్రు రమేష్, సీనియర్ నాయకులు మర్రి గోపి, లక్ష్మీనారాయణ, మండల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రాణాలు కాపాడేందుకు కాలు తొలగించారా...? లేక నిర్లక్ష్యంతో ఆ పరిస్థితి తెచ్చారా..?
- గొప్పలకు పోయి బోర్లా పడ్డ పి.యం. బ్రదర్స్ ఆసుపత్రి తీరు..?
- కాలు తొలగించినది మీ ఆసుపత్రేనా..? హైదరాబాద్ వైద్యులా..?
- 18 రోజుల తర్వాత రోగిని తరలించి చేతులు దులుపుకున్న వైనంపై ప్రశ్నలు
- అత్యవసర చికిత్స పక్కన పెట్టి మూడు శస్త్రచికిత్సలు ఎందుకు..?
- లక్షల రూపాయలు ఖర్చు చేయించి చివరకు వికలాంగుడిగా మార్చారన్న బాధితుల ఆరోపణలు
- ఇరుకు భవనంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు అనుమతులు ఎలా..?
- డి.ఎం.&హెచ్.ఓ. సమగ్ర విచారణ చేపట్టాలని బాధితుల డిమాండ్




# పి.యం. బ్రదర్స్ ఆసుపత్రిపై కొత్త వివాదం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ లోని పి.యం. బ్రదర్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చుట్టూ వివాదాలు మరింత ముదురుతున్నాయి. ఇటీవల ఇల్లందు ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు భానోత్ నరేష్ చికిత్స విషయంలో బాధిత కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా తాజాగా ఆసుపత్రి యాజమాన్యం విడుదల చేసిన వివరణ మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది.**

● కొత్తగూడెం, ప్రజాజ్యోతి

రోగి ప్రాణాలను కాపాడేందుకు కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అత్యవసర పరిస్థితుల్లో పలు శస్త్రచికిత్సలు నిర్వహించి బాధితుడిని కాపాడేందుకు ప్రయత్నించామని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. ఆసుపత్రికి సంబంధించిన కీలక వ్యక్తి ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పలువురికి చేరవేయడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే ప్రకటనపై బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రోగి ప్రాణాలను కాపాడేందుకు కాలు తొలగించాల్సి వచ్చిందంటే ఆ నిర్ణయం తీసుకుని కాలు తొలగించినది మీ ఆసుపత్రేనా..? లేక హైదరాబాద్‌లోని వైద్యులా..? అని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ కాలు తొలగించడం తప్పనిసరి అయితే 18 రోజుల పాటు ఆసుపత్రిలో ఉంచి లక్షల రూపాయలు ఖర్చు చేయించిన తర్వాత ఎందుకు ఇతర ఆసుపత్రులకు తరలించారని పి.యం. బ్రదర్స్ వైద్యులను నిలదీస్తున్నారు. పి.యం. బ్రదర్స్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే నరేష్ కాలు కోల్పోయాడని బాధితులు ఇప్పటికే ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం రైలు ప్రమాదం అనంతరం నరేష్‌ను చుంచుపల్లి మండలం విద్యానగర్ పరిధిలోని పి.యం. బ్రదర్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించి సుమారు 18 రోజుల పాటు చికిత్స అందించారు. ఈ కాలంలో మూడు శస్త్రచికిత్సలు నిర్వహించారని రూ.5 లక్షలకు పైగా ఖర్చు చేయించారని చెబుతున్నారు. అయినప్పటికీ చివరకు పరిస్థితి విషమించిందని చెబుతూ విజయవాడకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారని పేర్కొంటున్నారు. హైదరాబాద్‌లోని వైద్యులు పరిస్థితిని పరిశీలించిన అనంతరం కాలును తొలగించాల్సి వచ్చిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సకాలంలో పి.యం. బ్రదర్స్ ఆసుపత్రి వైద్యులు సరైన నిర్ణయం తీసుకుని ఉంటే తమ కుటుంబ పెద్ద కాలు కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› ప్రాణాలు కాపాడేందుకు కాలు తొలగించారా...? లేక నిర్లక్ష్యంతో ఆ పరిస్థితి తెచ్చారా..?

రోగి పరిస్థితి తీవ్రంగా ఉందని ప్రాణాలు కాపాడేందుకే కాలు తొలగించాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని ఆసుపత్రి యాజమాన్యం సరైన నిర్ణయం తీసుకున్నట్లుగా అబద్ధపు ప్రకటనలు చెబుతున్న నేపథ్యంలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాలు తొలగించడం అనివార్యమని ముందుగానే గుర్తించి ఉంటే సుమారు 18 రోజుల పాటు ఆసుపత్రిలో ఎందుకు ఉంచారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ 18 రోజుల కాలంలో నిర్వహించిన మూడు శస్త్రచికిత్సల అవసరం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేయించిన అనంతరం మాత్రమే ఇతర ఆసుపత్రులకు ఎందుకు తరలించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చివరకు హైదరాబాద్‌లో కాలును తొలగించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. రోగి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో పి.ఎం. బ్రదర్స్







సరైన వైద్యం నిర్వహించి ఉంటే నరేష్‌కు కాలు తొలగించే పరిస్థితి వచ్చేది కాదని బాధితులు ఆరోపిస్తున్నారు. జరిగిన నష్టానికి సమాధానం చెప్పకుండా బూటకపు మాటలతో ప్రజలను నమ్మించేందుకు తప్పుడు ప్రకటనలు చేయడం సిగ్గుచేటు అంటూ పలువురు విమర్శిస్తున్నారు. రోగి కాలు తొలగించిన ఘటనలో వైద్య నిర్లక్ష్యం ఉందా...? బాధితుల వద్ద సొమ్ము దోచుకునేందుకే అత్యవసర శస్త్రచికిత్సకు బదులుగా ఇతర శస్త్రచికిత్సలు చేయడం వెనుక కారణాలు ఏమిటో అనే విషయాన్ని అధికారులు నిష్పక్షపాతంగా తేల్చాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### ››› ఇరుకు భవనంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అనుమతి ఎలా..?

ఇప్పటికే పలు వివాదాల్లో నిలిచిన ఈ ఆసుపత్రి మౌలిక సదుపాయాలపైనా స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి అవసరమైన ప్రమాణాలు, అత్యవసర వైద్య సదుపాయాలు, నిపుణుల సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. కనీసం అంబులెన్స్ నిలిపేందుకు సరైన స్థలం కూడా లేదని ఆరోపిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులు సేదతీరేందుకు కూడా తగిన స్థలం లేదని వాహనాల పార్కింగ్ సౌకర్యం కూడా లేదని ప్రశ్నిస్తున్నారు. ఇన్ని లోపాలు ఉన్న చోట మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు అనుమతులు ఎలా మంజూరు చేశారో జిల్లా అధికారులే చెప్పాలని అంటున్నారు. ఆసుపత్రిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత శాఖలు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### ››› డి.ఎం.&హెచ్.ఓ. గారు... సమగ్ర విచారణ చేపట్టండి..!

ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశం కావడంతో ఈ వ్యవహారాన్ని సాధారణ ఫిర్యాదుగా కాకుండా వైద్య నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీ ద్వారా విచారణ జరపాలని ప్రజా సంఘాలు, బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. చికిత్స రికార్డులు, శస్త్రచికిత్సల వివరాలు, రిఫరల్‌కు దారితీసిన కారణాలు, వైద్యుల నిర్ణయాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు వెలికితీసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

# సుభాష్ నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- ఏడవ వార్డు బీఆర్ఎస్ వార్డు సభ్యులు కావూరి గోపి



**భద్రాచలం టౌన్, జూన్ 1, ప్రజాజ్యోతి** భద్రాచల పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ లో ఉన్నటువంటి సమస్యల పై సోమవారం భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణను సుభాష్‌నగర్ కాలనీవాసులతో కలిసి బీఆర్ఎస్ వార్డు సభ్యులు కావూరి గోపి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కావూరి గోపి మాట్లాడతూ సుభాష్ నగర్ కాలనీలో వీధి స్తంభాలు సమస్య అలానే వీధి దీపాలు, ,డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఇబ్బంది అవుతుందని రానున్న వర్ష కాలాన్ని దృష్టి లో ఉంచుకోని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అలానే గత మూడు నెలల నుంచి శానిటైజేషన్ వంటి పనులు చేయడం లేదని, శానిటైజేషన్ పనులు కూడా చేపట్టాలని సర్పంచ్ గారిని కోరారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కె.ప్రేమ్ కుమార్, దుమాల,రాజేశం, మారెడ్డి.గణేష్,ప్రవీణ్ కుమార్ రాంబాబు,సాయి కిషోర్ పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాలు నేరుగా పాఠశాలలకే పంపాలి : పీఆర్టీయూటీఎస్

**చర్ల, జూన్ 01:(ప్రజా జ్యోతి ):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న నోటు పుస్తకాలతో పాటు పాఠ్యపుస్తకాలను కూడా యూడిఐఎస్ఈ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎంఆర్సీ కేంద్రాల నుంచి నేరుగా ఆయా పాఠశాలలకు చేరవేసి ప్రధానోపాధ్యాయులు స్వీకరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూటీఎస్ చర్ల మండల శాఖ డిమాండ్ చేసింది.కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో జనగణన, బడిబాట కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరింది. పాఠ్యపుస్తకాల సరఫరాలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించింది.ఈ మేరకు పీఆర్టీయూటీఎస్ చర్ల మండల శాఖ అధ్యక్షుడు ఎస్.ఎస్.ఎస్. రవికుమార్, ప్రధాన కార్యదర్శి తుర్రం వీరభద్రం ప్రభుత్వాన్ని, విద్యాశాఖ అధికారులను కోరారు.

# ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య



**భద్రాచలం టౌన్, జూన్ 1, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం, నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి శీఘ్ర దర్శనంతో పాటు తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

# భద్రాచలం ఐటీడీఏ డిడిగా చందన బాధ్యతల స్వీకరణ



**భద్రాచలం టౌన్ , జూన్ 1 , ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్రీమతి చందన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆమెకు, ఇప్పటివరకు ఇన్చార్జి డిడిగా వ్యవహరించిన అశోక్ బాధ్యతలను అప్పగించారు. అనంతరం, బాధ్యతలు స్వీకరించిన చందనను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గాలివానకు నేలకొరిగిన వృక్షాలు







**చర్ల, జూన్ 01:(ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా కురిసిన వర్షానికి పలుచోట్ల చెట్లు విరిగి పడగా విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మండలంలోని కలివేరు, గుంపెనగూడెం ,రాళ్లగూడెం గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలుల ప్రభావం అధికంగా కనిపించింది. చర్ల–భద్రాచలం ప్రధాన రహదారిపై పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారిపై చెట్లు అడ్డంగా పడిపోవడంతో వాహనాలు కొంతసేపు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పంచాయతీ సిబ్బంది వెంటనే సంఘటన స్థలాలకు చేరుకుని రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. అనంతరం రహదారిని శుభ్రపరిచి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించారు. సిబ్బంది సత్వర చర్యలతో ప్రయాణికులకు ఎలాంటి పెద్ద ఇబ్బందులు కలగకుండా పరిస్థితిని చక్కదిద్దారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బలహీనంగా ఉన్న చెట్ల సమీపంలో నిలబడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

# భద్రగిరి మార్ట్‌లో తక్కువ ధరకే పాఠశాల సామాగ్రి: ఐటీడీఏ పీఓ బి.రాహుల్

**భద్రాచలం టౌన్, జూన్ 1 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఐటీడీఏ శుభవార్త అందించింది. పాఠశాలలకు అవసరమైన అన్ని రకాల నోట్ బుక్స్, స్టేషనరీ సామాగ్రిని భద్రగిరి మార్ట్‌లో సరసమైన ధరలకే విక్రయిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

**అన్ని వస్తువులూ ఒకే చోట..** పాఠశాలలకు అవసరమైన నోట్ బుక్స్‌తో పాటు జామెట్రీ బాక్సులు, స్కూల్ బ్యాగులు తదితర విద్యా సంబంధిత మెటీరియల్



అంతా భద్రగిరి మార్ట్‌లో అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు.

బయటి మార్కెట్‌తో పోలిస్తే నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే విక్రయిస్తున్నామని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాహుల్ కోరారు.

భద్రగిరి మార్ట్‌లో పాఠశాల అవసరాలకు సంబంధించిన సామాగ్రిని కొనుగోలు చేయడం ద్వారా, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే కోరం

- కాంగ్రెస్ ప్రభుత్వం, పేదల ప్రభుత్వం

**టేకులపల్లి,జూన్01,ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పేదల ప్రభుత్వంఅని పేదల సంక్షేమం కోసంఅనేక పథకాలు ప్రవేశ పెట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పలుగ్రామాలలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలను సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.మండలలోని టేకులపల్లి, గోలియాతండ, 9వమైల్ తండ, బేతంపూడి, రోళ్లపాడు గ్రామ పంచాయతిలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎమ్మెల్యే కోరం కనకయ్యను సాదరంగా ఆహ్వానించి, స్వీట్స్ తినిపించి శాల్వాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతీ పేదవానికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తాం అని అన్నారు. మంగళవారం తెలంగాణ ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు పట్టాలను ఇవ్వడం ప్రారంభిస్తారు.మహిళల సంక్షేమ మే ధ్యేయంగా ముందుకు సాగుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఏపథకం పెట్టిన అది మహిళల పేరున మాత్రమే పెడుతుందన్నారు. గృహజ్యోతి పథకంతో ఉచిత కరెంటు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరునే పథకం రూపు దిద్దడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ , జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్,





హౌసింగ్ ఏఈ గణేష్ , కే ఓ సి యూనియన్ ప్రెసిడెంట్ ముచ్చా సుధాకర్,సర్పంచులు బానోత్ పూర్ణ, సుభాష్ చంద్ర బోస్,ఊకె సునీత, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, పోశాలు, రెడ్యానాయక్, లక్ష్మయ్య, భద్రు, సర్దార్, రమేష్, దేవ్ సింగ్, ఈశ్వర్, సక్కో,కుమార్,రాందాస్,లవకుమార్, శివాజీ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

- జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేసిన టి.యు.డబ్ల్యూజె ఐజేయు నాయకులు

**కొత్తగూడెం, జూన్ 1( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టి.యు.డబ్ల్యూజె ఐజేయు నాయకులు జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు కీలక డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు మంజూరు చేయాలని ఇండ్ల స్థలాలు మరియు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. అలాగే జర్నలిస్టులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, వారి పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు కుటుంబాలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రాయితీతో కూడిన వైద్య సేవలు అందించాలని అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు రైల్వే పాస్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టుల వాహనాలకు పోలీస్ స్టిక్కర్లు జారీ చేయడంతో పాటు, ప్రతి జర్నలిస్టుకు బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు రమణారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జె. వెంకటరత్నం, జిల్లా కార్య





దర్శి జే. రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి నాగచంద్ర, ఐజేయు జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

# బూర్గంపహాడ్ కబరస్థాన్లో మంచినీటి బోరు ఏర్పాటు

**బూర్గంపహాడ్, జూన్ 1(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రమైన బూర్గంపహాడ్ కబరస్థాన్లో ఎమ్మెల్యే సొంత నిధులతో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. కబరస్థాన్లో మంచినీటి వసతి లేక అంత్యక్రియల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను గతంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మహ్మద్ పాషా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన కబరస్థాన్లో బోరు ఏర్పాటు చేయించడంతో మైనార్టీ నాయకులతో పాటు స్థానిక సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రహరీగోడ లేకపోవడంతో ఆ నిర్మాణం కూడా త్వరలో చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు మైనార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, భజన సతీష్, కైపు శ్రీనివాసరెడ్డి, గుద్దేటి ప్రవీణ్, బీబ్లాక్ మహిళా నాయకురాలు బర్ల నాగమణి, మైనార్టీ నాయకులు ఆరీఫ్, నయీమ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, 02,( ప్రజా జ్యోతి)** ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, డి ఆర్ ఓ పద్మావతి తో కలిసి ప్రజల నుంచి వినతులును స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం కీలకమని తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

చుంచుపల్లి మండలం రాందాస్ తండాకు చెందిన లక్ష్మీబాయి తాను బీఎస్సీ వరకు విద్యాభ్యాసం పూర్తి చేశానని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉన్నందున ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన ప్రమీల తన భర్తతో కలిసి శారీరక దివ్యాంగులమని, సొంత ఇల్లు లేకపోవడంతో గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేయగా దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం పీడీ, హౌసింగ్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. చుంచుపల్లి మండలానికి చెందిన మాలోతు బద్రు తనకు సర్వే నంబర్ 118/1లో 2 ఎకరాల 20 గుంటల సాగుభూమి ఉన్నప్పటికీ, పట్టాదారు పాసుపుస్తకం 20 గుంటలకు మాత్రమే జారీ అయిందని, మిగిలిన 2 ఎకరాల భూమికి కూడా పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం చుంచుపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

అన్నపురెడ్డిపల్లి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన షేక్ గాలిబ్ సాహెబ్ తాను ఎం.ఏ. (తెలుగు), బి.ఎడ్. వరకు చదివానని, 75 శాతం అంగవైకల్యం కారణంగా కుటుంబ పోషణ భారంగా మారిందని, తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏదైనా ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.

దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం జిల్లా విద్యాశాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

మణుగూరు మండలం బెస్తగూడెం గ్రామానికి చెందిన కంపేర్ల పాపయ్యకు మణుగూరు మండలం రామానుజవరం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 104లో 2 ఎకరాల 22 గుంటల భూమి ఉందని, సింగరేణి ఓసీ విస్తరణలో భాగంగా 1 ఎకరం 38 గుంటలకు మాత్రమే సర్వే నిర్వహించారని, మిగిలిన భూమిని సర్వే చేయకపోవడంతో జీవనాధారం కోల్పోతున్నానని పేర్కొంటూ మిగిలిన భూమిని కూడా సర్వే చేయాలని కోరారు.

దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ-ఎల్ఏ)కు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం పట్టణంలోని గణేష్ బస్తీ వాసులు తమ ప్రాంతంలో కోతుల బెడద అధికంగా ఉందని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధైర్యసాహసాలకు దక్కిన గుర్తింపు

- **సీఐ రాజు వర్మకు శౌర్య పతకం**
- **ఎస్ఐ కేశవ్ , హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, కానిస్టేబుల్ రాముకు కఠిన సేవా పతకాలు**









**చర్ల, జూన్ 01 : (ప్రజాజ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో అసాధారణ ధైర్యసాహసాలు, విశిష్ట సేవలు, ప్రజా భద్రత పట్ల అంకితభావంతో పనిచేసిన పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పతకాలను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శౌర్య పతకం, కఠిన సేవా పతకాలు అందుకున్న పోలీసు అధికారులకు ప్రజాప్రతినిధులు, సహచర పోలీసులు, స్థానిక ప్రజలు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చర్ల సీఐ రాజు వర్మ తన విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి, ప్రజల రక్షణ కోసం చేసిన విశేష కృషికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక శౌర్య పతకం అందుకున్నారు. చర్ల పోలీసు శాఖలో నిబద్ధతతో సేవలందిస్తూ, విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన ఎస్ఐ కేశవ్ , హెడ్ కానిస్టేబుల్ రాంబాబులకు ,కానిస్టేబుల్ రాములకు కఠిన సేవా పతకాలు లభించాయి.పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఇటువంటి పురస్కారాలు స్ఫూర్తిదాయకమని, క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు తప్పకుండా లభిస్తుందనడానికి ఈ పురస్కారాలు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా ముందుండి సేవలందిస్తున్న పోలీసు సిబ్బంది కృషిని ప్రభుత్వం గుర్తించి గౌరవించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారంలో, శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో, విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో ఈ అధికారులు చూపిన సేవలు ప్రశంసనీయమని స్థానికులు కొనియాడారు. ప్రజల భద్రత కోసం విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి ఈ అవార్డులు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. శౌర్యం, సేవా తత్పరత, బాధ్యతాయుత విధి నిర్వహణకు ప్రతీకగా నిలిచిన ఈ ముగ్గురు అధికారులకు దక్కిన పతకాలు పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాయని యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దక్కిన ఈ గౌరవం వారి సేవా జీవితంలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిపోతుందని పలువురు పేర్కొన్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**బూర్గంపహాడ్, జూన్ 1 (ప్రజాజ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని మేజర్ పంచాయతీ సారపాక పరిధిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు సారపాక 10వ వార్డు సభ్యులు పాటి అశోక్ సోమవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎండలో పనిచేస్తున్నందుకు తనవంతుగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉపాధి కూలీలకు పనుల ప్రదేశం వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలని, టెంట్లు, మంచినీటి సౌకర్యంతో పాటు ఎండవేడమిని తట్టుకునేలా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## బొమ్మనపల్లిలో లారీ ఢీకొని ఎద్దు మృతి



**టేకులపల్లి, జూన్01, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బొమ్మనపల్లి సమీపంలో టీఎస్04యుబి 2759 నెంబర్ గల లారీ ఢీకొట్టడంతో ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.మంగ్యాతండాకు చెందిన శంకర్ అనే రైతుకు చెందిన ఎద్దు మేతకు వెళ్తుండగా అతివేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది.లారీ బలంగా తగలడంతో శ్వాస అందక పశువు మరణించిందని పశువైద్యుడు అనిల్ ధ్రువీకరించారు.రైతుకు వెన్నుముక అయిన ఎద్దు మరణించడంతో రైతు కుటుంబ అది తట్టుకోలేక బోరున విలపించారు.పూర్తి వివరాలు ఇంకా తెలవాల్సి ఉంది.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో ఇద్దరు అధికారుల బాధ్యతల స్వీకారం

- **ఎంపీడీవోగా ఎస్‌వి సత్యనారాయణ**
- **మండల పంచాయతీ రాజ్ అధికారిగా జె గణేష్ గాంధీ**





**అన్నపురెడ్డిపల్లి, జూన్ 1, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో నూతనంగా ఎంపీడీవోగా ఎస్‌వి సత్యనారాయణ, మండల పంచాయతీ రాజ్ అధికారిగా జె గణేష్ గాంధీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వారి రాక సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాలతో సన్మానించి పూల బొకేలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్‌వి సత్యనారాయణ మాట్లాడుతూ తాను లక్ష్మీదేవిపల్లి మండలంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా అన్నపురెడ్డిపల్లికి వచ్చినట్లు తెలిపారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం వంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని అధికారులకు సూచించారు. మండల పంచాయతీ రాజ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె గణేష్ గాంధీ గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.

## గాలి వాన బీభత్సం

- వడగళ్ల వానతో అపార నష్టం
- గాలి దుమారంతో విరిగిన చెట్లు





**గుండాల. జూన్ 1. ప్రజాజ్యోతి** వాతావరణం లో ఎలాంటి మార్పు లేకుండా అకస్మాత్తుగా ఒక్కసారిగా గాలి వాన బీభత్సం సృష్టించింది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా అండ కొట్టుతూ అనుకోకుండా గాలి వాన దంచి కొట్టడంతో 30 నిమిషాల పాటు మండల కేంద్రం తమ్మించిపోయింది అనేక చోట్ల చెట్లు రేకుల షెడ్లు విరిగిపడ్డాయి మొక్కజొన్న తడిసి ముద్దయి పోయింది మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం పిఏసిఎస్ లో మొక్కజొన్న నిలువలు ముద్దాయి ఒక్కసారిగా వర్షం కుంభ ధారగా పడడంతో రైతులు ఏం చేయలేకపోయారు.

## తెలంగాణ ఆవిర్భావం అమరుల త్యాగాల ఫలితం

- రాష్ట్ర అవతరణ దినోత్సవం తెలంగాణ ప్రజల గర్వకారణం
- మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పర్సా వెంకట్



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 1, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలకు అన్నపురెడ్డిపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్సా వెంకట్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎన్నో పోరాటాలు, త్యాగాలు, బలిదానాల ఫలితంగా సాధ్యమైందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు, ప్రజలకు, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా గాంధీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా ప్రజలు కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచారని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగిస్తోందని అన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కృషి కొనసాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, మండల ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

# డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు జాబ్ ఆఫర్ లెటర్‌కు అవకాశం

- ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచలో ఏఈడీపీ ప్రత్యేక కోర్సులు.





**పాల్వంచ, జూన్ 1, ప్రజాజ్యోతి:** విద్యార్థులకు డిగ్రీతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచలో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏఈడీపీ) కింద ప్రత్యేక డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ తెలిపారు. కళాశాలలో బీకాం విభాగంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), సైన్స్ విభాగంలో హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ కోర్సులు విద్యార్థులకు విద్యాభ్యాసంతో పాటు ప్రాయోగిక అనుభవాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

### ››› అప్రెంటిస్‌షిప్‌తో ఉద్యోగ నైపుణ్యాలు

ఏఈడీపీ విధానంలో విద్యార్థులు డిగ్రీ చదువుతో పాటు వివిధ పరిశ్రమలు, సంస్థలలో అప్రెంటిస్‌షిప్ శిక్షణ పొందుతారు. దీని ద్వారా ఉద్యోగ రంగానికి అవసరమైన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, వృత్తిపరమైన అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం లభిస్తుంది. కోర్సు పూర్తయ్యే సమయానికి విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు పరిశ్రమలలో పని చేసిన అనుభవాన్ని కూడా సొంతం చేసుకుంటారు. ఐదవ సెమిస్టర్‌లో అప్రెంటిస్‌షిప్ సమయంలో నెలకు రూ.12,000 స్టైఫెండ్ చొప్పున ఆరు నెలలపాటు అందించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంబంధిత సంస్థల నుంచి జాబ్ ఆఫర్ లెటర్లు పొందే అవకాశాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు.

### ››› విస్తృత ఉద్యోగ అవకాశాలు

బీఎఫ్ఎస్ఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు బ్యాంకులు, బీమా సంస్థలు, ఆర్థిక సేవల సంస్థలు, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన వారికి ఆసుపత్రుల నిర్వహణ, ఆరోగ్య సేవల సంస్థలు, వైద్య నిర్ధారణ కేంద్రాలు, ఆరోగ్య బీమా సంస్థలు తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయి.

### ››› ఈ నెల 15 వరకు అడ్మిషన్లు

దోస్త్ మూడవ దశ అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 15వ తేదీ వరకు ప్రవేశాలు కొనసాగనున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఏఈడీపీ కోర్సుల్లో చేరి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆమె కోరారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచను సంప్రదించాలని సూచించారు.

# స్మారక స్తూపం లో స్మరిస్తూ నరసన్న బాటలో నడుద్దాం

- నిస్వార్థ కమ్యూనిస్టు యోధుడు జోగ నర్సయ్య
- అమరుల బాటలో అడుగులు వేద్దాం , సమస్యలపై పోరాడుదాం
- సిపిఎం రాష్ట్ర నేతలు. మల్లు లక్ష్మి, పోతినేని సుదర్శన్,, నున్న నాగేశ్వరరావు,, అన్నవరపు కనకయ్యలు




**గుండాల. జూన్ 1 ప్రజా జ్యోతి** నిస్వార్థ కమ్యూనిస్టు యోధుడు, జోగ నరసయ్య అని, మారక సూపర్ రూపంలో ఎప్పుడు ప్రజల్లో ప్రజా కార్యక్రమాలలో ఉంటాడని సిపిఎం రాష్ట్ర నేతలు మల్లు లక్ష్మి, పోతినేని సుదర్శన్, మున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్యలు అన్నారు సోమవారం గుండాల మండలంలోని తూరుబాక గ్రామంలో ఐదవ వర్ధంతి సందర్భంగా జోగ నరసయ్య స్మారక స్థూప ఆవిష్కరణ సభను ఉద్దేశించి మాట్లాడారు. జోగ నరసయ్య స్వస్థలంలో నిర్మించిన స్థూపాన్ని పోతినేని సుదర్శన్ ఆవిష్కరించగా, మల్లు లక్ష్మి జెండా ఆవిష్కరించారు. జోగా నర్సయ్య చిత్రపటానికి నున్న నాగేశ్వరరావు, బండి రమేష్, అన్నవరపు కనకయ్యలు పూలమాలలు వేశారు అనంతరం సిపిఎం మండల నాయకులు తోలం గోపి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి నేతలు మాట్లాడుతూ జోగ నరసయ్య అనేక పోరాటాలు ప్రజా సమస్యలపై నిరసనలు చేస్తూ



నిర్బంధాలను ఎదుర్కొని సిపిఎం పార్టీ ఎదుగుదలపై ఎనలేని కృషి చేశారని కొనియాడారు ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం శ్రమించేవాడని ,నరసయ్య లేకున్నా అయిన రూపంలో స్మారక స్తూప లో కనబడుతూనే ఉంటాడని ఆయన ఆశయాలను ముందు తీసుకువెళ్లాలని కోరారు. ఆనాటి ఐక్య ఉద్యమాలతో అన్ని పార్టీలతో కలిసి అనేక విషయాలలో పని చేశాడని నరసయ్య లేని లోటు తీరనిది అన్నారు విప్లవ కమ్యూనిస్టు పార్టీల్లో పనిచేసిన నరసయ్య తదుపరి సిపిఎం పార్టీలో చేరి నిస్వార్థ రాజకీయ నాయకుడిగా ముద్ర వేసుకున్నాడన్నారు ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటు అనేక సమస్యలపై యోగ నరసయ్య అనేక ప్రజా ఉద్యమాలను నడిపించాడని, దాని పర్యవసానమే ఈనాటి జనసంద్రోహానికి నిదర్శనం అన్నారు సమాజంలో దోపిడీ, ఈ సమాజంలో అసమానతలు ఉన్నాయి, ఈ సమాజంలో దోపిడీ ఉంది, ఈ సమాజంలో దుర్మార్గం ఉంది దౌర్జన్యాలు ఉన్నాయి ఈ సమాజం మారాలంటే పోరాటమే శరణ్యమని బలంగా నమ్మిన నాయకుడు జోగ నరసయ్య అని నరసయ్య ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు నడుం మింగించాలన్నారు పార్టీలు ఏవైనా ప్రజా సమస్యలపై పోరాడాలంటే ఎర్రజెండా పార్టీలే శరణమన్నారు జోగ నర్సయ్య అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడిచి ఆశయ సాధనకై ఆయన ఆశయాలను ఆయన లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మధు, రేపాకుల శ్రీనివాస్, కొలగాని బ్రహ్మచారి, అన్నవరపు సత్యనారాయణ, ఎస్ ఏ నబి, నిమ్మల వెంకన్న, పాల్గొన్నారు ఈ సభలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం వీరన్న, మాస్ లైన్ నాయకులు మంగయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు కోరం సీతారాములు, తుడుం దెబ్బ నాయకులు కొడెం వెంకటేశ్వర్లు, ఈసం శ్రీను, ఈసం పాపారావులు పార్టీల కచ్చితంగా జోగనర్సయ్య పోరాటాలను గుర్తు చేసి .మాట్లాడారు.



# బడికి భద్రత ఎక్కడ..?







- గేటు లేని బడి
- కూలిన ప్రహరీ కరువైన రక్షణ..!
- బడి ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు
- దృష్టి సారించని అధికారులు

**చర్ల, జూన్ 01:(ప్రజాజ్యోతి):** భవిష్యత్ తరాలకు విద్యాబుద్ధులు నేర్పి దేశానికి ఉత్తమ పౌరులను అందించాల్సిన ప్రభుత్వ పాఠశాల నేడు అధికారుల నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. చర్ల మండలంలోని మసీద్ సెంటర్‌లో పల్లె ప్రకృతి వనానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రస్తుతం సమస్యలతో సతమతమవుతోంది. విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన పాఠశాల భవనం, ఆవరణ, మౌలిక సదుపాయాల పరిస్థితి చూస్తే అర్థమవుతుంది .ఒకవైపు కూలిపోయిన కాంపౌం డ్ వాల్, మరోవైపు గేటు లేకపోవడం, పగిలిపోయిన డ్రైనేజీ స్లాబ్, శిథిలావస్థకు చేరుకున్న పాత భవనాలు ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు వంటి అనేక సమస్యలు విద్యార్థుల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. పాఠశాలల పునఃప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నప్పటికీ సంబంధిత శాఖల నుంచి ఎలాంటి చర్యలు కనిపించకపోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైనది.కొంతకాలం క్రితం పాఠశాలలో మరమ్మత్తుల పనుల నిమిత్తం ప్రధాన గేటును తొలగించారు అని అయితే పనులు పూర్తయిన తర్వాత కూడా కొత్త గేటును ఏర్పాటు చేయకపోవడంతో పాఠశాల ఆవరణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది అని అంతేకాకుండా పాఠశాల ప్రహరీ గోడ కూడా పలు ప్రాంతాల్లో కూలిపోవడంతో ఎటువంటి రక్షణ లేకుండా మారిపోయింది అని దీంతో పాఠశాల ప్రాంగణంలోకి ఎవరైనా స్వేచ్ఛగా ప్రవేశించే పరిస్థితి ఏర్పడింది అని గ్రామస్తులు అంటున్నారు.ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు అసాంఘిక వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం సేవించడం, ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వదిలివెళ్లడం వంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు విలువలు నేర్పాల్సిన విద్యాలయం మద్యం సేవించే ప్రదేశంగా మారడం అత్యంత బాధాకరమని చదువుల దేవాలయంగా ఉండాల్సిన పాఠశాల పవిత్రతకు భంగం కలిగే విధంగా జరుగుతున్న ఈ ఘటనలపై అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరుతున్నారు.మరోవైపు పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ఉన్న డ్రైనేజీపై ఏర్పాటు చేసిన సిమెంట్ స్లాబ్ పూర్తిగా పగిలి





పోయి ప్రమాదకరంగా మారింది. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ విద్యార్థులు ఇదే మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది అని చిన్నారులు తెలియక ఆ స్లాబ్‌పై నడిచే సమయంలో డ్రైనేజీలో పడిపోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.అయితే పాఠశాలలో అత్యంత ఆందోళన కలిగిస్తున్న అంశం శిథిలావస్థలో ఉన్న ఉపయోగంలో లేని పాత భవనాలు శ ప్రమాదకరంగా మారేఅవకాసాలు లేకపోలేదు గోడలు పగుళ్లు ఏర్పడి బలహీనపడగా, పైకప్పు కూడా శిథిలమై ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలకు వచ్చే చిన్నారులు ఆటల సమయంలో ఆ భవనం సమీపానికి వెళ్లడం లేదా లోపలికి ప్రవేశించడం జరిగితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని మండలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడు వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఈ భవనం పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు, తేమ కారణంగా ఇప్పటికే బలహీనపడిన గోడలు, పైకప్పు ఒక్కసారిగా కూలిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. గతంలో అనేక ప్రాంతాల్లో వర్షాల కారణంగా శిథిల భవనాలు కూలిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేస్తున్నారు. అలాంటి దుర్ఘటన ఇక్కడ కూడా జరగకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ముఖ్యంగా పాఠశాల పునఃప్రారంభం తర్వాత విద్యార్థులు ఆడుకుంటూ శిథిల భవనాల వద్దకు వెళ్లే అవకాశం ఉందని అటువంటి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే దాని బాధ్యత ఎవరు వహిస్తారని ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు హామీలు ఇవ్వడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని వారు స్పష్టం చేస్తున్నారు.స్థానికుల అభిప్రాయం ప్రకారం ఈ సమస్యలు ఒక్క రోజులో ఏర్పడినవి కావు అని నెలల తరబడి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే పరిస్థితి ఇంత దారుణంగా మారిందని ఆరోపిస్తున్నారు. విద్యార్థుల ప్రాణ భద్రత కంటే అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికే ప్రాధాన్యత ఇస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందువల్ల మండల విద్యాశాఖ అధికారి, గ్రామ పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే పాఠశాలను సందర్శించి అత్యవసర చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు . కూలిపోయిన కాంపౌండ్ వాల్‌ను పునర్నిర్మించడం, కొత్త గేటును ఏర్పాటు చేయడం, డ్రైనేజీ స్లాబ్‌ను మరమ్మత్తు చేయడం, శిథిల భవనాలను వెంటనే కూల్చివేయడం లేదా పూర్తిస్థాయిలో పునర్నిర్మించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు.పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు ఈ సమస్యలను పరిష్కరించి విద్యార్థుల భద్రతతో రాజీ పడకుండా వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలను సురక్షితమైన విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. చదువుల దేవాలయంగా నిలవాల్సిన ఈ పాఠశాలలో మరమ్మత్తులకు అధికారులు చొరవ చూపాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**స్కూల్ హెడ్మాస్టర్ లక్ష్మీపతి వివరణ:** ప్రైమరీ స్కూల్ సమస్యలపై హెడ్మాస్టర్ లక్ష్మీపతిని వివరణ కోరగా వారు మాట్లాడుతూ పాఠశాల సమస్యలపై గతంలో పై అధికారులకు ,పంచాయతీ అధికారులకు సమస్యను వారి దృష్టికి తీసుకు వెళ్లానని వారు సమస్యను పరిష్కరిస్తానని అన్నారని కానీ ఇప్పుడు వరకు సమస్య పరిష్కారం కాలేదని మరి ఒకసారి అధికారుల దృష్టికి పాఠశాల సమస్యలను తీసుకుని వెళ్లి పరిష్కారం అయ్యేలాగా చూస్తానని అన్నారు.

**ఎంఈఓ రమణ వివరణ :** పాఠశాల సమస్యలపై విద్యాశాఖ అధికారి రమణను వివరణ కోరగా వారు మాట్లాడుతూ పాఠశాలలో సమస్యలను స్కూల్ రిపేర్ వర్క్స్ గ్రాంట్స్ కింద మరమ్మతులు చేయించే లాగా చూస్తానని అన్నారు.

## పాఠశాలలు తెరవక ముందే పాఠ్య పుస్తకాల పంపిణీ

- జూన్ 12న విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేత
- పాల్వంచ మండలంలోని 75 ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా పూర్తి



**పాల్వంచ, జూన్ 1, ప్రజాజ్యోతి:** నూతన విద్యా సంవత్సరం 2026–27 ప్రారంభానికి ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా విద్యాశాఖ ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసింది. పాల్వంచ పట్టణ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాలను సోమవారం పాల్వంచలోని పుస్తకాల గోదాముల నుంచి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) శ్రీరామ్మూర్తి పంపిణీ చేశారు. జిల్లా గోదాముల నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలను పాల్వంచకు తరలించి, మండలంలోని 75 మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర విద్యాశాఖ యూడైస్ గణాంకాల ఆధారంగా అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను ముందుగానే సిద్ధం చేసి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తోందన్నారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యే తొలి రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోలేటి భవాని శంకర్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**పినపాక,జూన్ 01(ప్రజాజ్యోతి):** పినపాక మండలానికి చెందిన కోలేటి భవాని శంకర్ కుటుంబాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల భవాని శంకర్ సతీమణి విజయలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా, ఆ విషాద ఘటనపై మంత్రి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, విజయలక్ష్మి మృతి బాధాకరమని అన్నారు. కుటుంబానికి ఇది తీరని లోటని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, బంధుమిత్రుల సహకారంతో ఈ విషాదాన్ని అధిగమించాలని సూచించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు. భవాని శంకర్‌ను ఓదార్చిన ఎమ్మెల్యే, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.కోలేటి భవాని శంకర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వీరాభిమాని కావడంతో, వ్యక్తిగతంగా వచ్చి పరామర్శించడం కుటుంబ సభ్యులకు కొంత ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. విజయలక్ష్మి సేవలను గుర్తు చేసుకుంటూ ఆమె కుటుంబ సభ్యులకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పినపాక మండల అధ్యక్షులు రామనాథం, పినపాక మండల సర్పంచులు, ఉప సర్పంచులు,స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ కుంటలో అనధికారకంగా చేపలు పట్టినవారిపై చర్యలు తీసుకోండి



**టేకులపల్లి,జూన్01, ప్రజాజ్యోతి:** అక్రమంగా ముత్యాలమ్మ కుంటలో అనధికారికంగా చేపలు పట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బేతంపూడి మత్స్యకారులు టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్ ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ గత సంవత్సరంలో వేసిన చేప పిల్లలు అధిక వర్షాల వల్ల వెళ్లిపోవడం వల్ల తిరిగి ఆలస్యంగా చేప పిల్లల వదలడంతో ఈ సంవత్సరం పట్టుబడికి చేపలు రాకపోవడంతో బేతంపూడి గ్రామంలో ఇతరులు అనధికారి చేపలు పట్టనివ్వకుండా పోలీసు, రెవెన్యూ శాఖ, గ్రామ సర్పంచులు బందోబస్తు కల్పించాలని వేడుకున్నారు.చేపల పెంపకంతో జీవనోపాధి పొందుతున్న మాలాంటి మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు.అక్రమంగా చేపలు పట్టెవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మత్స్యకారులు సీతారాములు, లక్పతి, రామోజీ, లచ్చిరాం, రాజు, బద్దు,బాల్య, శ్యామ్ లాల్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి -- భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్





**భద్రాచలం టౌన్, జూన్ 1 , ప్రజాజ్యోతి** భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం అక్కడికి విచ్చేసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ఆటో యూనియన్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజా భద్రత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

## సింగ్యా తండా టు లచ్చతండ 70 సం.ల రహదారి ఆక్రమణ



**టేకుల ప ల్లి, జూన్0 1 , ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం సింగ్యాతండా టు లచ్చతండా గ్రామాల మధ్య 70 సంవత్సరాల గా రాకపోకల రహదారిని పలువురు రైతులు అనధికారికంగా ఆక్రమించారని సింగ్య తండ గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాగా,దీనిపై స్పందించిన తహశీల్దార్ లంకపల్లి వీరభద్రం ఆదేశాల మేరకు సోమవారం ఆర్ఐ క్షేత్రస్థాయి పరిశీలన జరిపి,రహదారి ఆక్రమణకు గురైనట్లు విచారణలో నిజమేనని తేలిందని ఆయన తెలిపారు.ఈ రహదారి ని ఆక్రమించిన రైతులకు చట్టపరంగా నోటీసులు జారీ చేసి,చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# ఆయిల్ ఫామ్ రేటు అదిరింది

**మే నెలకు టన్నుకి 23,852**
**హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు**





**అశ్వారావుపేట, జూన్ 01, ప్రజా జ్యోతి :** ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు శుభవార్త అందింది. "మే" నెలకు ఆయిల్ పామ్ తాజా ధరను టన్నుకు రూ.23,852గా నిర్ణయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలతో పోలిస్తే ధర రూ.351పెరగటంతో పంట సాగు చేసిన రైతుల్లో ఆనందం నెలకొంది. ఆయిల్ పామ్ పంటకు గిట్టుబాటు ధర లభించడం వల్ల రైతులకు ఆర్థికంగా ఊరట కలుగుతుందని ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో టన్నుకు రూ.23,852 ధర నిర్ణయించడం సానుకూల పరిణామమని అభిప్రాయపడుతున్నారు. ఈ ధరతో ఆయిల్ పామ్ సాగుపై మరింత ఆసక్తి పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ ఫామ్ కు మంచి మద్దతు ధర రావడంలో కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. భవిష్యత్తులో కూడా రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మెయింటెనెన్స్ పేరుతో కరెంట్ కోతలు... ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

- **తరచూ విద్యుత్ నిలిపివేతపై మండిపడుతున్న గ్రామాల ప్రజలు**



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 1, ప్రజా జ్యోతి:** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా 33కేవీ పెంట్లం లైన్ నిర్వహణ పనుల పేరుతో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఈ ప్రకటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "మెయింటెనెన్స్" పేరుతో దాదాపు ప్రతిరోజూ విద్యుత్ సరఫరాను నిలిపివేయడం పరిపాటిగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. రోజుకు పలుమార్లు కరెంట్ కట్ చేస్తూ, ప్రతిసారీ కొత్త కారణాలు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖకు ప్రజల ఇబ్బందులతో సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి, తొట్టి పంపు, వద్దుగూడెం, వెంకటాపురం, బుచ్చన్నగూడెం, మర్రిగూడెం, పెంట్లం, నామవరం, రాజాపురం, కంపగూడెం, భాస్కరపురం గ్రామాల ప్రజలు విద్యుత్ కోతలతో తీవ్రం గా నష్టపోతున్నారు. రైతులు వ్యవసాయ పనులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతుండగా, విద్యార్థులు చదువులకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. వేసవి కాలంలో ఇప్పటికే విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే, తరచూ నిర్వహణ పనుల పేరుతో సరఫరా నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లైన్ నిర్వహణ పనులు నిజంగా జరుగుతున్నాయా? లేక అధికారుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇదంతా జరుగుతోందా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తరచూ జరుగుతున్న విద్యుత్ కోతలపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా టీఆర్ ఎస్ జెండా పండుగ

- **దమ్మపేటలో ఘనంగా నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన కార్యక్రమం**




**దమ్మపేట, జూన్ .01(ప్రజా జ్యోతి)** దమ్మపేట మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ ఎస్) ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మే 20వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న జెండా పండుగ కార్యక్రమాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు డి. వీరన్న మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన అశ్వారావుపేట నియోజకవర్గ ఇంచార్జ్, న్యాయవాది సొడెం వెంకట్ మాట్లాడుతూ, జెండా పండుగ కార్యక్రమాలను గ్రామ గ్రామాన నిర్వహించి పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల హక్కుల సాధన కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లకావత్ సురేష్, వి. రవి, కుర్సం రాంబాబు, కుర్సం సతీష్, తాటి కిరణ్, పానుగంటి ప్రసాద్, వూకే ముత్యాలు, సొడెం సంతోష్, జంగం దినేష్, కొల్లు జగదీష్, మారగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యుత్తు ఘాతానికి గురై వ్యక్తి మృతి



**ములకలపల్లి, జూన్ 01, ప్రజాజ్యోతి:** విద్యుత్తు ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చోటి గూడెం లో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మధు ప్రసాద్ కథనం ప్రకారం మండలంలోని చోటిగూడెం గ్రామానికి చెందిన కీసరి నవీన్ (28 ) తన ఇంట్లో విద్యుత్తు బల్బు ఏర్పాటు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్తు షాక్ తగిలి అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి పిర్యాదు మేరకు స్థానిక ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆయిల్‌పామ్ రైతుల ఇంట కాసుల వర్షం





- రికార్డు స్థాయికి గెలల ధర.. మంత్రి తుమ్మల చొరవకు రైతుల హర్షం



**దమ్మపేట, జూన్ .01(ప్రజాజ్యోతి):** తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణ ఆయిల్ ఫెడ్ ప్రకటించిన తాజా ధరలతో ఆయిల్‌పామ్ గెలల ధరలు రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకోవడం రైతుల్లో కొత్త ఆశలను నింపుతోంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల నేపథ్యంలో గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్న సాగుదారులకు ఈ నిర్ణయం భారీ ఊరట కలిగించింది. ఫిబ్రవరిలో టన్ను గెలల ధర రూ.21,546గా ఉండగా, మార్చిలో ఏకంగా రూ.1,459 పెరిగి రూ.23,005కు చేరింది. అనంతరం మే నెల ప్రారంభంలో మరోసారి పెంపుతో రూ.23,501గా నిర్ణయించిన ఆయిల్ ఫెడ్, తాజాగా మే నెల ధరను టన్నుకు రూ.23,852గా ప్రకటించింది. వరుసగా ధరలు పెరుగుతుండటంతో ఆయిల్‌పామ్ సాగుదారుల ఆదాయం గణనీయంగా పెరగనుంది. రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ ముడి పామాయిల్ మార్కెట్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ రైతులకు మెరుగైన ధరలు లభించేలా చర్యలు చేపట్టడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని చెబుతున్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడమే కాకుండా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ధరల పెంపు కారణంగా ఇప్పటికే సాగు చేస్తున్న రైతులకు అధిక ఆదాయం లభించడమే కాకుండా, కొత్తగా మరెందరో రైతులు కూడా ఆయిల్‌పామ్ సాగు వైపు ఆకర్షితులయ్యే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆయిల్ ఫెడ్ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ తదితర జిల్లాల్లో రైతులు సంబరాలు జరుపుకుంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రైతులు అడగకముందే వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రికార్డు స్థాయిలో ధరలు పెరిగేలా కృషి చేసినందుకు మంత్రిని అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, "ఆయిల్‌పామ్ సాగు పట్ల మాకు మరింత నమ్మకం పెరిగింది. ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో మా కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు మాకు ఎంతో బలాన్నిస్తున్నాయి" అని ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రకటించిన ధరలతో ఆయిల్‌పామ్ సాగు రాష్ట్ర వ్యవసాయ రంగంలో లాభసాటి పంటగా మరింత బలపడుతుండగా, రైతుల ఆదాయ వృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలవనుందని వ్యవసాయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

- - అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి
- - సిపిఐ పట్టణ కార్యదర్శి, విద్యార్థి జేఏసీ మాజీ కన్వీనర్ : దుర్గ్యాల సుధాకర్



**మణుగూరు, జూన్ 01 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని, తెలంగాణ ఉద్యమ సాధనలో అమరులైన ఉద్యమకారుల కుటుంబాలను గుర్తించి వారిని ఆదుకోవాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి, మాజీ తెలంగాణ విద్యార్థి జేఏసీ కన్వీనర్ దుర్గ్యాల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ రెండవ తేది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 13 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొని అనేక కేసులు, అరెస్టులు, నిర్బంధాలను ఎదుర్కొని ఎందరో ఉద్యమకారులు జైలుపాలు అయ్యారని వాపోయారు. అనేక మంది తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ బంగారు భవిష్యత్తును, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను త్యాగం చేసి అమరులయ్యారని అన్నారు. అమరులైన కుటుంబాలను గుర్తించటంలో గత ప్రభుత్వం 10 సంవత్సరాల పరిపాలనలో విఫలమయ్యారని ఘాటుగా విమర్శించారు. దీంతో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని ఉద్యమంలో పాల్గొన్న వేల మంది నిరుద్యోగ యువత వయస్సు పెరిగి ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితికి చేరారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలంగాణ అమరుల త్యాగాల పునాదులమీద ఏర్పడ రాష్ట్రం తెలంగాణ అని, ఉద్యమ కారులను, అమరవీరుల కుటుంబాలను గుర్తించి వారిని ఆదుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలు చేసి విశ్వసనీయతను నిరూపించుకోవాలని అన్నారు. నీరు, నిధులు, నియామకాల మీద అమలు జరిగేలా చేస్తామన్న మాటలను అమలు పరచాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యమ కారుల కోసం వయోపరిమితిని దృష్టిలో పెట్టుకొని వయసు సడలింపు చేయాలని తెలిపారు. అంతేకాకుండా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం, అమరవీరుల కుటుంబాల కోసం ఒక కమిటీ ప్రతిపాదన వేసింది. ఆ కమిటీ నాలుగు రకాలుగా విభజన చేసి ఉద్యమకారులను గుర్తిస్తామని ప్రకటన చేసింది. ప్రభుత్వం, ఆ కమిటీ వెంటనే ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని వారు గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం కొన్ని వాగ్దానాలు చేసిందని ఆ వాగ్దానాలు అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త పెన్షన్ కూడా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు అమలు జరగడం లేదని, వెంటనే కొత్త పెన్షన్ విధానం అమలు చేయాలని అన్నారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, అర్హత కలిగినటువంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీనియర్ నాయకులు ఎస్కే. సర్వర్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల బిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం, ఎస్వి. నాయుడు, కొత్తపల్లి సీతారాములు, బోసెట్ సంపత్ ఆధర్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి





- అటవీ అభివృద్ధి సంస్థ డివిజన్ మేనేజర్ మాధవి

**ములకలపల్లి, జూన్ 01 ప్రజాజ్యోతి :** అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ పాల్వంచ డివిజన్ మేనేజర్ మాధవి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాల్వంచ డివిజన్ తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ, పర్యావరణ, అటవీ, విజ్ఞానశాస్త్ర మరియు సాంకేతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి తో కలిసి మాధవి ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలు, మానవ–వన్యప్రాణుల సంఘర్షణ నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుంచి 11 వరకు గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్ ఎస్. నాగరాజు, బి. సైదానాయక్, సిబ్బంది తాజుద్దీన్, పెద్దగౌమల్ల ప్రసాద్, వార్డు సభ్యురాలు సున్నం భద్రమ్మ, నాయకులు శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, మెచ్చా వెంకప్ప, ఇబ్రహీం, పాయం ముత్తయ్య, రాయల సాంబశివరావు, రింగు బాలకృష్ణ, బచ్చల సురేష్, సిగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇంటితో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు

- దమ్మపేటమండలంలో ఘనంగా గృహప్రవేశాలు
- విద్యుత్ కనెక్షన్లకు భారీ రాయితీలు
- కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ నిర్ణయాలకు ప్రజల హర్షం













**దమ్మపేట, జూన్ .01(ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో దమ్మపేట మండల కేంద్రం, మందలపల్లి, మొద్దులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో లబ్ధిదారులు ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశాలు నిర్వహించారు. కొత్త ఇంటి గడప దాటిన కుటుంబాలు ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ పండుగ వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహించాయి. దమ్మపేటలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులు సర్పంచ్ పగడాల రమాదేవి–రాంబాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబులను శాలువాలతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు చిన్నశెట్టి యుగంధర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలు, భూమిలేని నిరుపేదలు, నిరాశ్రయ కుటుంబాలకు దశలవారీగా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ శాశ్వత గృహాలను నిర్మించుకునే అవకాశం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, ధర్మసోతు పద్మ, పూనెం పోలమ్మ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దాసరోజు రామబ్రహ్మం, రామారావు, చిన్నశెట్టి గోపి, పగడాల కృష్ణారావు, గట్ల సర్వేశ్వరరావు, చక్రపు మల్లేశ్వరరావు, రొయ్యల కుమార్, వనమాల శ్రీనివాసరావు, శంకరవరం అయ్యప్ప, మళ్ళా చిన్నా తదితరులు పాల్గొన్నారు.

**››› ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు**

**››› కిలోమీటరు లోపు దూరం ఆధారిత ఛార్జీల రద్దు – ప్రభుత్వం కీలక నిర్ణయం**

కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల కుటుంబాలకు కొత్త విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది.

గృహ వినియోగదారులకు ఒక కిలోమీటరు లోపు కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకునే సందర్భంలో దూరం ఆధారిత ఛార్జీలను పూర్తిగా రద్దు చేసి, లోడ్ ఆధారిత ఫిక్స్ డు ఛార్జీల విధానాన్ని అమలు చేస్తోంది.మల్లారం గ్రామ శివారులో ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం లేకుండా జీవిస్తున్న సుమారు 60 కుటుంబాలకు త్వరలో విద్యుత్ సదుపాయం కల్పించనున్నట్లు దమ్మపేట విద్యుత్ శాఖ ఏఈ సాయి కిరణ్ తెలిపారు.

ఇందుకోసం ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను నెలకొల్పి విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, గ్రామపంచాయతీ నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

**››› దమ్మపేటలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు - మూడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు**

దమ్మపేట మండల కేంద్రంలో విద్యుత్ లో–వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మూడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది.

**››› మందలపల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు**

దమ్మపేట మండలం మందలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కూడా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పర్వతనేని వరప్రసాద్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పర్వతనేని వరప్రసాద్‌రావు మాట్లాడుతూ, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలకు గృహ భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి గడప దాటిన లబ్ధిదారుల ఆనందం, విద్యుత్ సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దమ్మపేట మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కొత్త ఊపునిస్తున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు.